రంగనాయకసాగర్ నీళ్లివ్వాలి

- సిద్దిపేట జిల్లా రైతుల ఆందోళన

నారాయణరావుపేట, ఫిబ్రవరి 19: రంగనాయకసాగర్ ప్రాజెక్ట్ ఎడమ కాలువ నుంచి సాగునీటిని విడుదల చేయాలని కోరుతూ బుధవారం సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలంలోని మల్యాల, బంజేరుపల్లి రైతులు రాఘవాపూర్ రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రంగనాయకసాగర్ ప్రాజెక్టు ద్వారా కొన్ని రోజులుగా నీటిని విడుదల చేశారని, ప్రస్తుతం కాలువల్లో నీటి ప్రవాహం తగ్గి సాగునీరు అందడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు మండుటెండల్లో సైతం సాగునీరు అందించి ఇబ్బందులు లేకుండా చూశారని పేర్కొన్నారు. ఇరిగేషన్ అధికారులు వచ్చి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నీరందిస్తామని హామీ ఇచ్చారు.

సిద్దిపేట జిల్లా రాఘవాపూర్ రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులు

కరెంట్ కోతలతో రైతన్నల తిప్పలు

పాలకుర్తి, ఫిబ్రవరి 19 : ఎండలు ముదురుతుండడంతో విద్యుత్ అధికారులు వ్యవసాయానికి కరెంట్ కోత పెడుతున్నారు. రోజుకు 10 నుంచి 15 సార్లు కరెంట్ తీసేస్తుండడంతో బోర్లు, బావుల్లో ఉన్న కొద్దిపాటి నీటిని వరి, ఇతర పంటలకు పెట్టుకోలేకపోతున్నామని జనగామ జిల్లా పాలకుర్తి మండల రైతులు వాపోతున్నారు. రెండు, మూడు రోజులుగా వ్యవసాయానికి నాలుగైదు గంటలు కరెంట్ పోతున్నదని, అర్ధరాత్రి 12 నుంచి 5 గంటల వరకు ఉండాల్సిన త్రీఫేజ్ కరెంట్‌ను రాత్రి 2 గంటలకు ఇచ్చి ఉదయం 5 గంటలకు తీసేస్తున్నారని ఆరోపిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో 24 గంటల నాణ్యమైన కరెంట్ సరఫరా జరిగిందని రైతులు గుర్తుచేసుకుంటున్నారు. ఎండలు మొదలవుతుండగానే కాంగ్రెస్ ప్రభుత్వం కరెంట్ కోతలు పెట్టడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

పగటిపూట కరెంటివ్వాలి

ఎండాకాలం రాకముందే కరెంట్ కోతలు మొదలైనయి. అధికారులు కావాలనే వ్యవసాయానికి కరెంట్ తీసేస్తున్నరు. రెండు, మూడు రోజులుగా పగటి పూట వ్యవసాయానికి 3 గంటల పాటు కోత విధిస్తున్నారు. రాత్రి 12 గంటలకు ఇవ్వాల్సిన విద్యుత్‌ను 2 గంటలకు ఇచ్చి 5 గంటలకు తీసేస్తున్నరు. ఓ పక్క చెరువులు, కుంటల్లో నీరులేక భూగర్భజలాలు అడుగంటి బోర్లు పోయడం లేదంటే.. మరో పక్క కరెంట్ కోతలతో పంట పొలాలు ఎండిపోతున్నాయి. ప్రభుత్వం పగటి పూటే విద్యుత్‌ను అందించాలి.

- పుర్మ రఘుపాల్‌రెడ్డి, రైతు, మల్లంపల్లి, పాలకుర్తి మండలం, జనగామ జిల్లా

జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని వల్మిడిలో ఎండిపోతున్న వరి పొలం

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మల్లాపూర్‌లో చుక్క నీరు లేక ఎండిపోయిన ఊర చెరువు

రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలో కాల్వలో నీళ్లు లేకపోవడంతో కాలిపోయిన మోటర్‌ను చూపుతున్న రైతు

ఎండుతున్న పంటలు

- పారని కాల్వలు.. అందని సాగునీరు
- అడుగంటిన భూగర్భ జలాలు
- ఆందోళనలో అన్నదాతలు
- ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్

ఎల్లారెడ్డిపేట/గంగాధర/మల్లాపూర్, ఫిబ్రవరి 19: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సాగునీరందక పంటపొలాలు ఎండిపోతున్నాయి. భూగర్భజలాలు అడగంటిపోవడం.. కాలువల ద్వారా సాగునీరు రాకపోవడంతో ఆరుగాలం పడిన కష్టం వృథా అవుతున్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి సాగునీరు విడుదల చేసి ఆదుకోవాలని కోరుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వారం క్రితం మల్కపేట రిజర్వాయర్ నుంచి ఎల్లారెడ్డిపేట మండలానికి సాగునీరు వదులుతామని అధికారులంతా హడావిడి చేసి, నాలుగైదు రోజులు మాత్రమే నీటిని వదిలారు. దీంతో పరీవాహక ప్రాంత రైతులు రూ.15వేల నుంచి రూ.20వేలు ఖర్చుపెట్టి మోటర్లు తెచ్చి కాల్వలో వేసి పొలాలకు పారించే ప్రయత్నం చేశారు. మూడు రోజులుగా సరిపడా నీళ్లు రాక మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్‌లో నిండుగా నీరున్నా.. కొండాపూర్ చెరువు జలకళను సంతరించుకున్నా.. మల్లాపూర్, గోపాల్‌రావుపల్లి, వెంకంపల్లి చెరువుల్లోకి చుక్కనీరు రాలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మూడు గ్రామాల్లో వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన చెందున్నారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం మొగిలిపేట పెద్ద చెరువు నిండుగా ఉండి కాలువల ద్వారా నీళ్లు వచ్చేవి. ప్రస్తుతం ఆ చెరువులో నీటి మట్టం తగ్గిపోవడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. గ్రామ శివారులోని పిల్లిగుట్ట ప్రాంతంలోని తనకున్న రెండెకరాల్లో ఇప్పటి వరకు రూ.40వేల పెట్టుబడి పెట్టి పంట సాగు చేస్తే నీళ్లు లేక ఎండిపోతున్నదని జక్కుల రాజమల్లయ్య ఆందోళన వ్యక్తం చేశాడు.

నూతనకల్ మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

ఎస్సారెస్పీ కాల్వకు సాగునీరు విడుదల చేయాలి

నూతనకల్, ఫిబ్రవరి 19 : ఎస్సారెస్పీ కాల్వకు సాగునీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని వేడుకుంటూ సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బుధవారం రైతులు ఆందోళన చేశారు. యాసంగిలో సాగు చేసిన వరి పొలాలు నీళ్లు సరిపోక వాడుతున్నాయని, ఇప్పటికే ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ పెద్దలు, అధికారులు స్పందించి వెంటనే ఎస్సారెస్పీ కాల్వ ద్వారా సాగునీరు అందించి ఆదుకోవాలని కోరారు.

పశువులకు మేతగా రైతు కష్టం

దేవరుప్పుల, ఫిబ్రవరి 19 : యాసంగి వరి పంటకు సాగునీరందక ఎండిపోతున్న దుస్థితి జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలో నెలకొంది. దేవాదుల రిజర్వాయర్ల ద్వారా గతంలో సాగునీరు అందగా రెండు పంటలు పండాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గోదావరి నదిలో నీళ్లున్నా రిజర్వాయర్ల నుంచి కాల్వలకు నీరు విడుదల చేయడం లేదు. ఓ వైపు చెరువుల్లో నీరు లేక, మరోవైపు కాల్వల ద్వారా గోదావరి జలాలు రాక వరి పొలాలు ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు సైతం అడుగుంటడంతో బోర్లు ఆగిపోస్తున్నాయి. దీంతో రైతులు ఎండుతున్న పొలంలో పశువులను మేపుతున్నారు. ఇప్పటికైనా కాల్వలు వదిలితే సగం పంటైనా చేతికి వస్తుందని, ఇదే పరిస్థితి కొనసాగితే మార్చి చివరినాటికి వరి చేన్లు పూర్తిగా ఎండిపోయి నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు.

దేవరుప్పుల మండలం రామరాజుపల్లిలో వరి పొలంలో బర్రెను మేపుతున్న రైతు

బర్రెను మేపుతున్న..

రెండెకరాల్లో యాసంగి నాటుపెట్టిన. బోరు ఆగి పోస్తున్నది. పంట చేతికొచ్చే నమ్మకంలేదు. ఇప్పటికే అరెకరం చేన్ల పాలిచ్చే బర్రెను మేపుతున్న. చెరువుల్లో నీళ్లుంటేనే బోర్లు పోస్తయి. ఈ సారి నీళ్లు నింపలే. నింపుతరనే నమ్మకంతోటి నాటు పెట్టిన. పదేండ్ల నుంచి ఎప్పుడు యాసంగి పంట ఎండలే. ఇదే మొదలు. కాంగ్రెస్ సర్కారు నీళ్లు వదులుతలేదు. నీరులేక గింజ చేతికొచ్చే టట్టు కనబడుతలేదు. ఇంత అధ్వానమైన పరిస్థితి ఎన్నడూ చూడలే.

- బండి ఉప్పలయ్య, రామరాజుపల్లి, దేవరుప్పల మండలం, జనగామ జిల్లా

కుర్మిద్దలో రోడ్డుపై పాలను పారబోస్తున్న పాడి రైతులు

పాడి రైతుల ఆందోళన

- పాలు రోడ్డుపై పారబోసి నిరసన
- బకాయిలు చెల్లించాలని డిమాండ్

యాచారం, ఫిబ్రవరి 19: రంగారెడ్డి జిల్లా యాచారం మండలం కుర్మిద్దలో పాడి రైతులు బకాయి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. బుధవారం రోడ్డుపై పాలు పారపోసి నిరసన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే మదర్ డెయిరీకి పాలు పోసే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. కుర్మిద్ద పాడి రైతులకు 4లక్షలకు పైగా పెండింగ్ బిల్లులు చెల్లించాల్సి ఉందని, సకాలంలో బిల్లులు చెల్లించకపోతే జీవనోపాధి ఎలా ఉంటుందని వాపోయారు. కాంగ్రెస్ పాలనలో పాడి రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, బిల్లులు చెల్లించకపోతే ఊరుకునేదిలేదని మదర్ డెయిరీ కుర్మిద్ద సొసైటీ చైర్మన్ బండి మహేందర్‌రెడ్డి హెచ్చరించారు.

నిజామాబాద్‌లో డీపీసీ ప్రారంభం

- పసుపు రైతుల ఆందోళనకు దిగొచ్చిన అధికారులు

కంఠేశ్వర్, ఫిబ్రవరి 19: నిజామాబాద్ మార్కెట్ యార్డులో డైరెక్ట్ పర్చేసింగ్ సెంటర్ (డీపీసీ) బుధవారం ప్రారంభమైంది. వ్యాపారులు, మార్కెటింగ్ అధికారులు, పాలకవర్గం కుమ్మక్కై గిట్టుబాటు ధర రాకుండా చేస్తున్నారని పసుపు రైతులు మంగళవారం ధర్నా చేపట్టిన సంగతి తెలిసిందే. పసుపు కొనుగోళ్లు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా డైరెక్ట్ పర్చేసింగ్ సెంటర్‌ను ఎందుకు ఏర్పాటు చేయలేదని అధికారులను నిలదీసిన విషయం విదితమే. కర్షకుల ధర్నా నేపథ్యంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ హుటాహుటిన స్పందించింది. రైతులు పసుపు కొమ్ములను బాగా ఎండబెట్టి, చెత్తాచెదారం లేకుండా తీసుకొస్తే ఎలాంటి కమీషన్ లేకుండా నేరుగా రైతు ఖాతాలో డబ్బులు జమ అవుతాయని మార్కెటింగ్ అధికారులు తెలిపారు.

యూరియా కోసం రైతుల పాట్లు

- కొనుగోలు కేంద్రం వద్ద బారులు

ఖానాపురం, ఫిబ్రవరి 19 : అన్నదాతకు యూరియా పాట్లు తప్పడంలేదు. వరంగల్ జిల్లా ఖానాపురం మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఎరువుల కొనుగోలు కేంద్రం వద్ద రైతులు యూరియా బస్తాల కోసం బారులు తీరారు. పాకాల ఆయకట్టు రైతులు యాసంగిలో 30 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. బుధవారం సొసైటీకి లారీ లోడ్ యూరియా రావడంతో రైతులు ఎగబడ్డారు. ఉదయం నుంచి క్యూలో ఉన్నప్పటికీ దొరకకపోవడంతో కొందరు రైతులు వెనుదిరిగారు. మధ్యాహ్నం మరో లోడ్ రావడంతో మరి కొంత మంది తీసుకెళ్లారు. సరిపడా యూరియాను అందుబాటులో ఉంచాలని పాకాల ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

వరంగల్ జిల్లా ఖానాపురం సొసైటీ ఎరువుల కొనుగోలు కేంద్రం వద్ద యూరియా కోసం బారులుతీరిన రైతులు

మా పంటలు కాపాడండి

తమ పంటలు కాపాడాలని కోరుతూ కరీంనగర్ రూరల్ మండల రైతులు బుధవారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం ఇచ్చారు. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు డీ-89 కాలువ ద్వారా నాలుగు విడతల్లో నీరు విడుదల చేస్తే తమ గ్రామాలకు నీళ్లు రావడం లేదని వాపోయారు. నారాయణపూర్ ద్వారా రామడుగు మండలం గుండి వాగు, ఇరుకుల్ల వాగుకు నీరు విడుదల చేయాలని కోరారు. - కరీంనగర్

మొగిలిపేటలో రైతు కన్నీరు

- ఎస్సారెస్పీ కాలువ నీరందక ఎండుతున్న పంటలు

మల్లాపూర్, ఫిబ్రవరి 19: జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం మొగిలిపేట పిల్లిగుట్ట ప్రాంతంలోని రైతులు సాగునీటి కోసం అరిగోస పడుతున్నారు. గ్రామ శివారులోని ఎస్సారెస్పీ ఉప కాలువ ద్వారా వచ్చే నీరు పెద్ద చెరువుకు చేరి అక్కడి నుంచి మళ్లీ కాలువ ద్వారా పొలాలకు అందుతుండేది. పదేండ్లుగా పుష్కలమైన జలాలతో రైతులు సంబురంగా పంటలు సాగు చేశారు. ఈ యాసంగిలో కెనాల్ ద్వారా చుక్క నీరు రాక, చెరువులో నీరు లేక తల్లడిల్లుతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే కొద్ది రోజుల్లో వందలాది ఎకరాలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామంలో నీటి జాడలేని పెద్ద చెరువు నుంచి పిల్లిగుంట ప్రాంత భూములకు వెళ్లే ఎస్సారెస్పీ కాలువ

పొట్ట దశలో వరి ఎండిపోతున్నది

ఊరి శివారుల రెండు ఎకరాల భూమి ఉంది. రూ.40 వేలు పెట్టుబడి పెట్టి వరి వేసిన. పొలం పొట్ట దశలోకి అచ్చింది. బావిలో నీళ్లు ఎల్లక పంట ఎండిపోతంది. మోటర్ పెడితే 40 నిమిషాలే నడిచి బావిల నీళ్లు లేక ఎత్తిపోతుంది. గతంల పెద్ద చెరువు నిండుగా ఉండి కాలువల ద్వారా నీళ్లు వచ్చేయి. ఇప్పుడు చెరువులో నీటి మట్టం తగ్గిపోయింది. బావులకు ఊటలు లేవు. రైతులను సర్కారు ఆదుకోవాలె. పదిహేను రోజులాయె పొలానికి నీళ్లు పెట్టక. కండ్ల ముందే పంట ఎండుతుంటే చూడబుద్ధి అయితలేదు. - జక్కుల రాజమల్లయ్య, రైతు, మొగిలిపేట

నీళ్లు లేక పసుపు పంట తవ్వలేదు

సరిగ్గా పసుపు ఆకు కోసి నెల దాటింది. ఇప్పటికి పారుకం నీళ్లు లేక పసుపును తవ్వలేదు. మొగిలిపేటలో నాలుగెకరాల భూమి ఉంది. ఇందులో రెండెకరాలు నువ్వులు, ఎకరం పసుపు వేసిన. మిగిలిన భూమిలో వరి నారుపోసిన. నీళ్లు సక్రమంగా అందక పొలాన్ని బీడు ఉంచిన. బావి పారుకంలో కరెంట్ మోటర్ పెడితే రోజు ఓ గంటకు పైగా నడుస్తున్నది. చెరువు నుంచి కాలువ ద్వారా నీళ్లు వస్తే అన్ని పంటలు పండేవి. గతంలో ఇంత నీటి కష్టం ఎప్పుడూ రాలేదు. సర్కార్, ఆఫీసర్లు పట్టించుకోని రైతుల సమస్యలను పరిష్కరించాలే. - ముక్కెర మల్లయ్య, రైతు, మొగిలిపేట

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాల్సిందే

- పరిహారం కోసం ఉదండాపూర్ భూనిర్వాసితుల డిమాండ్
- భిక్షాటనకు బయలుదేరగా అడ్డుకొన్న పోలీసులు
- ఒంటిపై పెట్రోల్ పోసుకొని రైతు ఆత్మహత్యాయత్నం
- ఆర్డీవోతో మాట్లాడిస్తామని నచ్చజెప్పిన డీఎస్పీ

జడ్చర్ల, ఫిబ్రవరి 19 : 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద పరిహారం అందించాలని ఉదండాపూర్ భూనిర్వాసితులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం పరిహారం విషయంలో న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పాలమూరు ప్రాజెక్టు పరిధిలోని ఉదండాపూర్ రిజర్వాయర్ బండ్‌పై నిర్వాసితులు రిలే దీక్షలు కొనసాగిస్తున్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో నిర్వాసితులు భిక్షాటన కోసం రోడ్డెక్కారు. సీఐ కమలాకర్, రూరల్ సీఐ నాగార్జునగౌడ్ జడ్చర్ల అతిథి గృహం వద్దకు చేరుకొని అనుమతి లేదంటూ వారిని అడ్డుకున్నారు. న్యాయం కోసం ఆందోళన చేస్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు నిర్వాసితులకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్యాకేజీ ఇవ్వడం లేదని రైతు మల్లయ్య మనస్తాపంతో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకునే యత్నంచేయగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం అక్కడి నుంచి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి డీఎస్పీ వెంకటేశ్వర్లుతో మాట్లాడించారు. గురువారం ఆర్డీవోను రిజర్వాయర్ వద్దకు తీసుకొచ్చి పరిహారం విషయంలో మాట్లాడిస్తామని నచ్చజెప్పి పంపించారు.

జడ్చర్లలో భిక్షాటన చేస్తున్న ఉదండాపూర్ భూనిర్వాసితులు, తమకు న్యాయం చేయడం లేదని ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్న రైతు మల్లయ్య

ఎన్నికలు ఎప్పుడో చెప్పండి

- బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ బార్ కౌన్సిల్ పాలకవర్గం గడువు ముగిసినప్పటికీ ఎన్నికలు నిర్వహించకపోవడంపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తీరును హైకోర్టు ఆక్షేపించింది. ఎన్నికల షెడ్యూలును నివేదించాలని గత విచారణలో ఆదేశిస్తే ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించింది. ఈనెల 25లోగా పూర్తి వివరాలు అందించాలని సూచించింది. పాలకవర్గం గడువు ముగిసినా ఎన్నికలు నిర్వహించకపోవడాన్ని సవాలు చేస్తూ న్యాయవాది కే అశోక్ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని జస్టిస్ బీ విజయ్‌సేన్ రెడ్డి బుధవారం విచారణ జరిపారు. సుప్రీంకోర్టులో కేసు విచారణలో ఉందని తప్పించుకునే ప్రయత్నం చేయవద్దని హితవు చెప్పారు. విచారణను ఈనెల 25కు వాయిదా వేశారు.

కోర్టుతో గారడీనా?

మొదటిపేజీ తరువాయి...

నిప్పులు చెరిగింది. హరీశ్‌రావుతోపాటు మాజీ పోలీసు అధికారి రాధాకిషన్‌రావుపై దర్యాప్తు నిలిపివేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఈ కేసులో వారిద్దరినీ అరెస్ట్ చేయరాదంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. ఈ కేసులో పోలీసులు ఒకవైపు కోర్టులో గడువు కోరుతూ మరోవైపు కేసు దర్యాప్తు పేరుతో అరెస్టులు చేయడం ఏమిటని ప్రశ్నించింది. కోర్టులతో ఇలాంటి ట్రిక్స్ (గారడీ) చేయవద్దని హెచ్చరించింది. తమపై పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసును కొట్టేయాలంటూ హరీశ్‌రావు, రిటైర్డు డీసీపీ రాధాకిషన్‌రావు దాఖలు చేసిన పిటిషన్లపై బుధవారం న్యాయమూర్తి జస్టిస్ కే లక్ష్మణ్ విచారణ జరిపారు. పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ, ఈ కేసులో పోలీసుల తరపున వాదించేందుకు సుప్రీంకోర్టు నుంచి సిద్ధార్థ లూథ్రా హాజరుకానున్నారని, విచారణను మార్చి 3 లేదా 7వ తేదీకి వాయిదా వేయాలని కోరారు. దీనిపై హరీశ్‌రావు తరపు న్యాయవాది ఆర్ చంద్రశేఖర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది దామా శేషాద్రినాయుడు స్పందిస్తూ.. ఇప్పటికే పోలీసులు మూడుసార్లు వాయిదా కోరారని చెప్పారు. ఇప్పుడు మళ్లీ వాయిదా కోరడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

కుట్రను అమలుచేసే ప్రమాదం

వాయిదాల పేరుతో క్రూరమైన కుట్రను అమలుచేసే లక్ష్యం ఉందని అన్నారు. అందుకే పదేపదే వాయిదాలు కోరుతున్నారని చెప్పారు. ఈ నెల 12న విచారణ పూర్తయ్యాక 15న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారని చెప్పారు. వాళ్లను భయపెట్టి నేరాంగీకార వాంగ్మూలాలను తీసుకోవడానికి పోలీసులు శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ కేసులో మూడో నిందితుడిని అరెస్ట్ చేయడంపై హైకోర్టులో పిటిషన్ దాఖలైందని, ఆ నిందితుడి రెండేళ్ల బాలుడితోపాటు భార్యను కూడా పోలీస్ స్టేషన్‌లో అర్ధరాత్రి 1.30 గంటల వరకు ఉంచారని చెప్పారు. వేధింపులకు గురిచేసి పేపర్లపై సంతకాలు తీసుకున్నారని, టార్చర్ పెట్టాక తెల్లకాగితాలపై సంతకాలు చేయించిన వాటిని పిటిషనర్లకు (హరీశ్‌రావు, రాధాకిషన్‌రావు) వ్యతిరేకంగా అఫిడవిట్లుగా చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇలాంటి పరిస్థితుల్లో మళ్లీ పోలీసులు కోరినట్టు కేసు విచారణను వాయిదా వేస్తే పిటిషనర్లకు తీరని నష్టం జరిగే ప్రమాదం ఉందని అన్నారు. మరోసారి గడువు ఇస్తే చిన్నచిన్న ఉద్యోగులను భయపెట్టి వాంగ్మూలం తీసుకుని పిటిషనర్లను కేసులో ఇరికించాలనే కుట్ర అమలయ్యే అవకాశం ఉందని చెప్పారు. ఒక ఉన్నతాధికారి సాక్షిని బెదిరించారని, నరకం అంటే తెలుసా, తాము చెప్పినట్లు చేయకపోతే నరకాన్ని ఇక్కడే చూపిస్తామని ఆ అధికారి బెదిరించారని న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు. కేసు వాయిదాల పేరుతో న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నారని, వెంటనే కోర్టు స్పందించాలని కోరారు. ఈ వాదనను పీపీ నాగేశ్వరరావు వ్యతిరేకించారు. వేధింపులకు గురిచేస్తే కింది కోర్టులో ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. పిటిషనర్లు ఇద్దరినీ అరెస్టు చేయరాదన్న హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఉండగా, కేసు దర్యాప్తును నిలిపివేయాలని కోరడం అన్యాయమన్నారు. దీనిపై స్పందించిన హైకోర్టు, అరెస్టు చేసిన వారితో పిటిషనర్లకు వ్యతిరేకంగా వాంగ్మూలాలు తీసుకుంటున్నారని న్యాయవాదులు చెప్తున్నారని గుర్తుచేసింది. నిందితుల నుంచి వాంగ్మూలాలను నమోదు చేశారా లేదా అని ప్రశ్నించింది. కేసు విచారణ కోరుతూ మరోవైపు దర్యాప్తు పేరుతో నిందితులను అరెస్టు చేయడమంటే కోర్టులతో గారడీ చేయడం కాకపోతే ఏమౌతుందని ప్రశ్నించింది. చివరికి పీపీ వినతి మేరకు విచారణను మార్చి 3వ తేదీకి వాయిదా వేసింది. అప్పటి వరకు కేసు దర్యాప్తును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులను జారీచేసింది.

ఫాం ల్యాండ్స్‌పై మీకేం హక్కు?

మొదటిపేజీ తరువాయి...

బాధ్యతలను హైడ్రాకు ఎప్పుడు అప్పగించిందని నిలదీసింది. చెరువులు, ప్రభుత్వ భూములు, పార్కుల పరిరక్షణ బాధ్యతలను మాత్రమే హైడ్రాకు కట్టబెట్టిందని పేర్కొన్నది. కానీ, హైడ్రా కమిషనర్ మాత్రం ఫాం సైట్లను కొనుక్కోవద్దని వ్యాఖ్యానించడం రాష్ట్రంలో రియల్‌ఎస్టేట్ రంగాన్ని నేలమట్టం చేయడంలో భాగమని మండిపడింది. హైడ్రా ఇప్పటివరకు ఏ ఒక్క చెరువునైనా రక్షించగలిగిందా? రాజకీయ నాయకులు కబ్జా చేసిన ప్రభుత్వ భూములను విడిపించారా? అని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నారగోని ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. కనీసం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ప్రీ లాంచ్ అమ్మకాలను నిలవరించకుండా చిన్న చితక రియల్‌ఎస్టేట్ వ్యాపారులను బలిపీఠం ఎక్కేలా హైడ్రా, కమిషనర్ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఫాం ప్లాట్లు ప్రభుత్వ భూములు కాదని, ఎమ్మార్వోనే రిజిస్ట్రేషన్ చేస్తున్నారని, పాస్‌బుక్ కూడా వస్తుందని, నాలా కన్వర్షన్ చేస్తే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ కూడా చేసుకోవచ్చని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు భూమి కొనుక్కోవద్దనే ధోరణిలో హైడ్రా పనితీరు ఉన్నదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే జీపీ లేవుట్లలో ఒక్కసారి కూడా రిజిస్ట్రేషన్ కానీ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేస్తామని, ఎల్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన విషయం హైడ్రా కమిషనర్‌కు తెలియకపోవడం విడ్డూరమని ఎద్దేవా చేశారు. తెలంగాణ రియల్టర్లను బలి చేసేలా ప్రభుత్వం హైడ్రా లాంటి సంస్థలను ఊసిగొల్పే ప్రయత్నాలను మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదే గనుక జరిగే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పది లక్షల మంది రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ప్రచారం చేస్తారని హెచ్చరించారు.